క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో ప్రజలు వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 0857–2232745, వాట్సాప్ – 9849907885కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

కంటి ఆపరేషన్లకు 63 మంది ఎంపిక

చిత్తూరు రూరల్: చిత్తూరు రాములుగుడివీధిలోని జైన్ సంఘం మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. మొత్తం 156 మంది హాజరు కాగా ఆపరేషన్లకు 63 మంది ఎంపికై నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు.

మున్సిపల్ ఎంహెచ్‌ఓకు షోకాజ్ నోటీసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ అధికారి(ఎంహెచ్ఓ)గా పనిచేస్తున్న డాక్టర్ లోకేష్‌కు కమిషనర్ అరుణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల నగరంలో పిచ్చి కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, కరుస్తున్నాయంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎంహెచ్ఓ పట్టించుకోవడంలేదని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

గణేష ఇరుముడులు చెల్లింపు



ఇరుముడులు తీసుకొస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి గణేష దీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడులు చెల్లించారు. స్థానికంగా స్వామివారి దీక్ష చేపట్టిన భక్తులు ఆదివారం మధ్యాహ్నం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఏఎన్‌ఆర్ శతజయంతి



ఏఎన్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఏఎన్‌ఆర్ శతజయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలను జ్ఞాపికలతో అభిమాన సంఘ నేతలు సత్కరించారు.

గంగినేని చెరువు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలోని గంగినేనిచెరువులో శుభ్రత పనులను త్వరగా పూర్తిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ అరుణ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం చెరువు శుభ్రత పనులను ఆమె పరిశీలించారు. చెరువులో గుర్రపుడెక్కలు ఎక్కువగా పేరుకుపోయి దుర్గంధం రావడంతో మున్సిపల్ సిబ్బంది శుభ్రత పనులు చేపట్టారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యను కమిషనర్ ఆదేశించారు.

నల్ల చట్టాలతో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గౌతమ్

చిత్తూరు కలెక్టరేట్: కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలతో కార్మికులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆరోపించారు. ఆదివారం చిత్తూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. పార్టీ బలోపేతానికి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కన్వీనర్లను నియమిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీసీసీ ఆస్తుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ దేవరాజురెడ్డి, నాయకులు పరదేశి, పూర్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం



నాట్యం చేస్తున్న కళాకారిణి



ఆలయంలో భక్తుల రద్దీ



యాగశాలలో పూజలు

- యాగశాలలో గణనాథుడికి ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. జై గణేష్ మహరాజ్‌కి జై అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. యాగశాలలో ఆదివారం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువు దీర్చి సుగంధ పుష్పాలతో అలకరించి పూజలు చేశారు. ఉభయదారులు, ఆలయ అధికారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆస్థాన మండపంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు చేసిన భరతనాట్యం, భక్తి గీతాలు, నాటికలు అలరించాయి. కళాకారులకు ఆలయ చైర్మన్, ఈఓ ప్రశంసా పత్రాలు అందించారు.



నాట్యం చేస్తున్న కళాకారులు



బిందెపై నాట్యం చేస్తున్న కళాకారిణి



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు



మాడవీధుల్లో కోలాటం వేస్తున్న కళాకారులు

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్‌రావు

బంగారుపాళెం: ఉపాధ్యాయులు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్‌రావు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం బంగారుపాళెంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. 49 ఏళ్లుగా విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టిందన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్ఎస్ నాయుడు, రఘుపతిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి రమణ, జిల్లా మహిళా కన్వీనర్ సరిత, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బంగారుపాళెంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థి దశ నుంచే సేవా భావం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కలిగించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను ఏర్పాటు చేశారని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. జాతీయ సేవా పథక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ.. కళాశాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రజలను సమాజసేవపై చైతన్య పరచడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల్లకట్టలేనిదన్నారు. తెలుగు లెక్చరర్ ఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ మాట్లాడుతూ.. సమాజాభ్యుదయమే ధ్యేయంగా సేవలందిస్తున్న జాతీయ సేవా పథకాన్ని 1969 సెప్టెంబర్ 24న ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వినీల, తిరుకుమరన్, కౌసర్‌జయాబేగం, ధర్మమూర్తి, సురేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మనోహర్

ఉత్తమ సేవకు గుర్తింపు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న అర్జున్

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ప్రైవేట్ ఉపాధ్యాయులు అవార్డులు అందజేసింది. గుడిపాల మండలం సీఎస్‌ఆర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అర్జున్ అవార్డును అందుకున్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి రథోత్సవంలో పాల్గొనే బోయలకు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేఖర్‌స్వామి, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఉభయదారులు రవిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

వేడుకగా కుంభాభిషేక పూజలు

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో ఆదివారం కుంభాభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి, వరదరాజులురెడ్డి ఉన్నారు.



సాయిబాబా సేవలో ఎమ్మెల్యే శ్రీనివాసులు

టౌన్ బ్యాంకుకు పూర్వ వైభవం

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు సహకార టౌన్ బ్యాంకుకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గిరింపేటలోని టౌన్ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడమే కాకుండా డిపాజిట్లకు ఇతర బ్యాంకుల కన్నా అధిక వడ్డీ చెల్లిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు పాలకవర్గం అవినీతికి పాల్పడి బ్యాంకు ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. దీంతో కొంత ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయన్నారు. ప్రస్తుత పాలకవర్గం బ్యాంకు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. బ్యాంకు ఆర్థిక లావాదేవీలు రూ.2 కోట్ల లాభాల దిశగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. ఖాతాదారులు కూడా బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. బ్యాంకు పాలకవర్గ చైర్మన్ రాంగణేష్, సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

కరెంటు షాక్‌తో పాడి ఆవు మృతి

బైరెడ్డిపల్లె: కరెంటు షాక్‌కు గురై పాడి ఆవు మరణించిన సంఘటన బేలుపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన ఇర్షాద్ తన పాడిఆవు ను పొలం వద్ద పశువుల కొట్టంలో ఉంచాడు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 3 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఇర్షాద్ పశువుల కొట్టంపై వైర్లు పడ్డాయి. దీంతో విద్యుత్ వైర్లు పాడి ఆవుకు తగలడంతో అక్కడిక్కడే మరణించింది. దాదాపు రూ.లక్ష విలువ చేసే పాడి ఆవు మృతితో జీవనాధారం కోల్పోయామని ఇర్షాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంకటేష్ ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ స్తంభాలను మార్పించారు.

బై..బై గణేశా..!



క్రేన్ సాయంతో జలధి చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్: వినాయకచవితిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఆదివారం గణపతి నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు చేపట్టారు. స్థానికులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకుడికి విశేష పూజలు చేసి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కట్టమంచిలో పుష్పాలంకరణలో స్వామివారి ఊరేగింపు కనువిందు చేసింది. అనంతరం కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

నేడు డీఐ రోడ్డు వినాయకుని నిమజ్జనం

చిత్తూరు డీఐ రోడ్డులో కొలువుదీర్చిన గణనాథులను సోమవారం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకుడు దీపక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిమజ్జన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. బళ్లారి డ్రమ్స్, దిండుకల్ డ్రమ్స్, కేరళ వాయిద్యాల నడుమ శోభా యాత్ర ఉంటుందన్నారు.

వేడుకగా నిమజ్జనోత్సవం

తవణంపల్లె: వెంగంపల్లెలో కొలువుదీర్చిన గణనాథుడికి ఆదివారం పూజలు నిర్వహించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



కట్టమంచిలో పుష్పాలంకరణలో ఊరేగుతున్న స్వామివారు



నిమజ్జనానికి చేరుకున్న వినాయకుడు



డప్పు వాయిద్యానికి చిందులేస్తున్న యువత



రిక్షాలో వినాయకుని నిమజ్జనానికి తీసుకొస్తున్న చిన్నారులు



వెంగంపల్లెలో..